


## తెలంగాణలో విస్తరించిన నైరుతి

అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -27 గురువారం 25 జూన్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## తుంగభద్ర జలాల్లో అన్యాయం

**కర్నాటక అక్రమ ప్రాజెక్టులతో పాలమూరు ఎడారి**

**ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలు కాపాడాలి**

**నీటి వాటాల కోసమే తెలంగాణ పోరాడి గెలిచింది**

**కర్నాటక దురాగతాలను అడ్డుకోకుంటే మళ్లీ పోరాటం తప్పదు**

**సిఎం రేవంత్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ**



**హైదరాబాద్,జూన్ 24.(జర్నలిస్ట్ వార్త)**
తుంగభద్ర జలాల్లో తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టే కుట్రలను తక్షణమే విరమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి టి. హరీశ్ రావు స్పష్టం చేశారు. తుంగభద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకుని ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాలని సీఎంకు ఆయన సూచించారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖను హరీశ్ రావు విడుదల చేశారు. 'సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన అతిపెద్ద అన్యాయాల్లో నీళ్ల దోపిడీ ఒకటన్నారు. **మిగతాది 2లో...**

# సర్ ప్రక్రియపై అప్రమత్తం కండి

**నిర్లక్ష్యం చేస్తే మార్పు తప్పదని నేతలకుసిఎం రేవంత్ స్ట్రాంగ్ వార్నింగ్!**





**నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని క్షమించం**

**పార్టీకోసం పనిచేయని వారిని వదులుకుంటాం**

**బాధ్యత లేని నాయకులను తప్పించడానికి వెనకాడం**

**సర్‌తో బిజెపి రాజకీయ కుట్రలకు తెరతీస్తోంది**

**జామ్ మీటింగ్‌లో సిఎం రేవంత్ ఘాటు హెచ్చరిక**

**హైదరాబాద్,జూన్ 24.(జర్నలిస్ట్ వార్త)**
ఎస్ఐర్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకులను క్షమించే ప్రసక్తి లేదని, పనిచేయకుండా పార్టీకి నష్టం కలిగిస్తామంటే చూస్తూ ఊరుకోం అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. పని చేయని వారికి 10 రోజుల సమయం ఇచ్చి చూస్తాం.. లేకుంటే వారి స్థానంలో మరొకరిని నియమిస్తామని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌పై సర్పంచ్‌లతో గ్రామాల్లో ప్రచారం చేయించాలని సూచించారు. తెలంగాణలో గురువారం నుంచి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ఎస్ఐఆర్ ప్రారంభం కానుండడంతో కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. **మిగతాది 2లో...**

## సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట...

**ఒకేసారి ఐదు కేసుల కొట్టివేత**

**2019 నాటి కేసుల నుంచి రేవంత్ రెడ్డికి విముక్తి**

**ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసుల్లో క్లీన్ చిట్**



**హైదరాబాద్,జూన్ 24.(జర్నలిస్ట్ వార్త)**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. 2019 హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచార సమయంలో ఆయనపై నమోదైన ఐదు కేసులను తెలంగాణ ఉన్నత న్యాయస్థానం బుధవారం కొట్టివేసింది. ఈ కేసుల నుంచి తనను విముక్తుడిని చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి దాఖలు చేసిన ఐదు వేర్వేరు పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు తుది తీర్పును వెలువరించింది. **2లో...**

## కెసిఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు

**రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు**

**కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆగమైన రాష్ట్రం**

**జిల్లా ప్రాజెక్టులపై మంత్రుల నిర్లక్ష్యం**

**సత్తుపల్లి పర్యటనలో కెటిఆర్**




**ఖమ్మం,జూన్ 24.(జర్నలిస్ట్ వార్త)**
రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యువల్ సీఎం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సెటైర్లు వేశారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రం ఆగమవుతుందని కేసీఆర్ అనాడే చెప్పారని అన్నారు. బీఆర్ఎస్ ఓటమితో రాష్ట్రం నష్టపోయిందని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి 72సార్లు ఢిల్లీ వెళ్లి ఏం సాధించారని ప్రశ్నించారు. బుధవారం సత్తుపల్లిలో కేటీఆర్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. **మిగతాది 2లో...**

## తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు..!

**కేంద్ర సర్వీసుల నుంచి సొంత కేడర్‌కు వచ్చిన సీనియర్ ఐఏఎస్**

**ఈ నెల 30న ప్రస్తుత సీఎస్ కె. రామకృష్ణారావు పదవీ విరమణ**

**కేంద్రంతో సమన్వయం కోసమే రేవంత్ రెడ్డి వ్యూహాత్మక ఎంపిక**



**హైదరాబాద్,జూన్ 24.(జర్నలిస్ట్ వార్త)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి (చీఫ్ సెక్రటరీ)గా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియామకం దాదాపు ఖరారైంది. ప్రస్తుతం కేంద్ర సర్వీసుల్లో ఉన్న ఆయనను తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థన మేరకు కేంద్రం రిలీవ్ చేసింది. ప్రస్తుత సీఎస్ కె. రామకృష్ణారావు పదవీ కాలం జూన్ 30తో **మిగతాది 2లో...**


## నేడు తుంగభద్ర ప్రాజెక్టు కొత్త స్పిల్‌వే గేట్ల ప్రారంభోత్సవం

**నేడు ఒకే వేదికపైకి ఏపీ, తెలంగాణ, కర్ణాటక సీఎంలు**

**రూ. 51 కోట్ల వ్యయంతో ఆరు నెలల్లో గేట్ల నిర్మాణం పూర్తి**

**2024 వరదల్లో గేటు కొట్టుకుపోవడంతో పటిష్ఠ చర్యలు**

**హోస్పేటలో జరగనున్న బహిరంగ సభలో పాల్గొననున్న నేతలు**


2లో.

## బిఆర్ఎస్ నేతల మాటలు నమ్మితే అధోగతే



**ఆ నలుగురూ దేశం మీద పడి దుష్ప్రచారాలు**

**ఇచ్చిన హామీలు అమలు చేస్తూ పోతున్నాం**

**ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమం**

**మీడియా సమావేశంలో మంత్రులు భట్టి, తుమ్మల**

**ఖమ్మం,జూన్ 24.(జర్నలిస్ట్ వార్త)**
కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. ఆనాడు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరమ్మ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరలేదని గుర్తుచేశారు. **మిగతాది 2లో...**

# సాయికృష్ణది లాకప్ డెత్

**సిట్ నిర్ధారణ.. విజయవాడ కోర్టుకు రిమాండ్ రిపోర్ట్ సమర్పణ**

**సీసీటీవీ ఫుటేజ్ డిలీట్, మృతదేహం మాయం చేశారని వెల్లడి**

**కృష్ణా లంక సీఐ నాగార్జునకు 14 రోజుల రిమాండ్**

**దర్యాప్తునకు సీఐ సహకరించడం లేదని సిట్ ఆరోపణ**



**విజయవాడజూన్ 24.(జర్నలిస్ట్ వార్త)**
ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన విజయవాడ యువకుడు గాదె సాయికృష్ణ అదృశ్యం కేసు కీలక మలుపు తీసుకుంది. ఇది అదృశ్యం కేసు కాదని, పోలీసు కస్టడీలో జరిగిన మరణం (లాకప్ డెత్) అని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించి సస్పెండైన కృష్ణలంక సీఐ నాగరాజుకు **మిగతాది 2లో...**

## ఏపీలో సువర్ణ అధ్యాయం

**జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రారంభంలో సీఎం చంద్రబాబు**




**రాయలసీమ రతనాలసీమగా మారబోతోంది**

**జొన్నగిరి గోల్డ్ మైన్‌తో ఇక్కడి ప్రజల జీవితాలు మారుతాయి**

**భవిష్యత్‌లో దేశమంతా జొన్నగిరి గురించే మాట్లాడుతుంది**

**శరవేగంగా సీమ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం**

**గొడ్డలి పార్టీ రాజకీయాలతో అప్రమత్తంగా ఉండాలి**

**కర్నూలు,జూన్ 24.(జర్నలిస్ట్ వార్త)**
ఏపీలో సువర్ణ అధ్యాయం మొదలైందని.. రాయలసీమ రతనాలసీమగా మారబోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం జొన్నగిరిలో గోల్డ్ మైన్స్ ప్లాంట్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జొన్నగిరి గోల్డ్ మైన్‌తో ఇక్కడి ప్రజల జీవితాలు మారుతాయన్నారు. **2లో...**

# సాయికృష్ణది లాకప్ డెత్

(మొదటి పేజీ తరువాయి)
విజయవాడ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. సిట్ కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పలు కీలక విషయాలను వెల్లడించింది. మే 6న మార్కాపురం నుంచి సాయికృష్ణను అదుపులోకి తీసుకుని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు తరలించారని, అక్కడ కస్టడీలో చిత్రహింసల వల్లే అతను మరణించాడని తెలిపింది. తన కొడుకు పోలీస్ స్టేషన్‌లో తీవ్రగాయాలతో, అపస్మారక స్థితిలో కనిపించాడని సాయికృష్ణ తల్లి చెప్పిన విషయాన్ని కూడా సిట్ ప్రస్తావించింది.లాకప్ డెత్‌ను కప్పిపుచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు జరిగాయని సిట్ పేర్కొంది. మే 1 నుంచి జూన్ 1 వరకు పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌ను ఉద్దేశపూర్వకంగానే డిలీట్ చేశారని నివేదికలో స్పష్టం చేసింది. అంతేకాకుండా, సాయికృష్ణ మృతదేహాన్ని మాయం చేశారని, దాన్ని ఖననం లేదా దహనం చేసేందుకు ప్రయత్నించారని సిట్ తెలిపింది. ఇప్పటికీ మృతదేహం లభ్యం కాలేదని పేర్కొంది. సీఐ నాగరాజు ఉద్దేశపూర్వకంగానే ఆధారాలను నాశనం చేసినట్టు తెలుస్తోందని సిట్ పేర్కొంది.సీఐ నాగరాజు దర్యాప్తునకు ఏమాత్రం సహకరించడం లేదని, తప్పుదోవ పట్టించే సమాధానాలు ఇస్తున్నారని సిట్ ఆరోపించింది. సాయికృష్ణను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచకుండా అక్రమంగా నిర్బంధించి, హైకోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చారని కూడా రిపోర్టులో పేర్కొన్నారు. కాగా, నిన్న 5 గంటల సుదీర్ఘ విచారణ అనంతరం సీఐ నాగరాజును సిట్ అధికారులు అరెస్ట్ చేయడం తెలిసిందే. ఈ క్రమంలో నాగరాజును జీజీహెచ్‌లో వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరచగా, జులై 8 వరకు రిమాండ్‌కు తరలించారు. కేసు చాలా సంక్లిష్టంగా ఉందని, దర్యాప్తునకు మరింత సమయం అవసరమని సిట్ కోర్టుకు విన్నవించింది. కేసు దర్యాప్తు నేపథ్యంలో, పోలీస్ శాఖ ఇప్పటికే సీఐ నాగరాజును విధుల నుంచి సస్పెండ్ చేసింది.

# సర్ ప్రక్రియపై అప్రమత్తం కండి

(మొదటి పేజీ తరువాయి)
ఈ సందర్భంగా నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ పక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి

తావులేకుండా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, బూత్ స్థాయి నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. ఓటర్ల హక్కులను కాపాడటంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, దేశవ్యాప్తంగా భాజపా రాజకీయ వ్యూహాలను గమనించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే సర్ విషయంలో సీరియస్‌గా లేకపోవడం పట్ల పలువురు ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదని ఆగ్రహం చెందారు సర్ పేరిట బీజేపీ కుట్ర చేస్తోందని.. అప్రమత్తంగా లేకపోతే ఇబ్బందులు తప్పవన్నారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గంలోనే ఉంటూ మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. తనకి ఒక నియోజకవర్గం కేటాయిస్తే వెళ్లి పనిచేస్తానని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఎమ్మెల్యేలు తీరు మారితే ఒకే అని.. వారం రోజుల్లో తీరు మారకపోతే ఎమ్మెల్యేల స్థానంలో యాక్టివ్‌గా ఉన్న మరోవ్యక్తిని ఇన్‌ఛార్జిగా నియమిస్తామని సీఎం స్పష్టం చేశారు. పార్టీ కోసం పనిచేయని వాళ్లు పార్టీకి అవసరం లేదని తేల్చిచెప్పారు. సర్ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. పార్టీలో ఏ పదవిలో ఉన్నా సర్ విషయంలో గ్రౌండ్ లెవల్‌కు వెళ్లి పనిచేయాల్సిందే అని అన్నారు. 'ఎవరెవరు పని చేయడం లేదో నా దగ్గర రిపోర్ట్ ఉంది. పద్ధతి మార్చుకోకపోతే వచ్చే మీటింగ్‌లో పేర్లు చెప్పాల్సి వస్తుంది. పేర్లు చెప్పించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దని అన్నారు. ఇన్‌ఛార్జి మంత్రులు కూడా బాధ్యత తీసుకోవాలని.. పనిచేయకపోతే ఇన్‌ఛార్జి మంత్రులను కూడా మారుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో ఓట్ల నిర్వహణ విషయంలో జరిగిన పరిణామాలను పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. తమకు అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికవాద ఓట్లను లక్ష్యంగా చేసుకుని కుట్రలు జరిగే ప్రమాదం ఉందని, ప్రతి అర్హత కలిగిన ఓటు జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు చర్యలు తీసుకోవాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు అత్యంత కీలకంగా పని చేయాలని సూచించారు. సర్ పక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్న ఎమ్మెల్యేలపై ఫైర్ అయ్యారు. ఈ విషయంలో చాలా మంది ఎమ్మెల్యేలకు వార్నింగ్ ఇచ్చారు. ఇప్పటికైనా తీరు మారాలని సూచించారు. ప్రతి ఓటునూ కాపాడుకోవాలని ఆదేశించారు. లౌకికవాదుల ఓట్ల తొలగింపు కుట్ర జరుగుతోందన్నారు. గద్వాల, మల్కాజిగిరి, భువనగిరి, నిజామాబాద్‌లో వీక్‌గా ఉన్నామని చెప్పారు. మెజారిటీ ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాలకు దూరంగా ఉండడం సబబు కాదని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. ఓటు హక్కు రాజకీయాల కోసం మాత్రమే కాదని మీనాక్షి నటరాజన్ అన్నారు. జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. మనిషికి ఆక్సిజన్ ఎంత అవసరమో ఓటు హక్కు అంతే అవసరమన్నారు. ఓటు అనేది ప్రతి మనిషికి సోషల్ స్టేటస్ అని చెప్పుకొచ్చారు. ఎంతో కష్టపడితే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఓటు హక్కు వచ్చిందని తెలిపారు. ఓటు హక్కును కాపాడవలసిన బాధ్యత అందరిది అని మీనాక్షి నటరాజన్ వెల్లడించారు. జూమ్ మీటింగ్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్లమెంట్, అసెంబ్లీ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

# తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు..!

(మొదటి పేజీ తరువాయి)
ముగియనుండటంతో అదే రోజున సంజయ్ జాజు నూతన సీఎస్‌గా బాధ్యతలు చేపట్టనున్నారని అధికారిక వర్గాల సమాచారం.

**జాజు కెరీర్ ట్రాక్ రికార్డ్ ఇదే!**

1992 బ్యాచ్, తెలంగాణ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన సంజయ్ జాజు, దాదాపు 13 ఏళ్ల సుదీర్ఘ కాలం పాటు కేంద్ర సర్వీసుల్లో పనిచేశారు. తెలంగాణ కేడర్ అధికారులలో ఇంత ఎక్కువ కాలం కేంద్ర సర్వీసుల్లో పనిచేసిన వారిలో ఆయన ఒకరు. కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శిగా, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

ప్రస్తుత సీఎస్ పదవీ విరమణకు సరిగ్గా వారం రోజుల ముందు ఆయనను సొంత కేడర్‌కు పంపుతూ కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ నిన్న ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన నియామకం దాదాపు ఖాయమైంది. “తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థన మేరకు సంజయ్ జాజును ఆయన సొంత కేడర్‌కు తిరిగి పంపేందుకు కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపిందని“ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌గా, నాటి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా సమర్థవంతంగా పనిచేశారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన వైపు మొగ్గు చూపడానికి ప్రధాన కారణం కేంద్రంలో ఆయనకున్న విస్తృత అనుభవం, పరిచయాలేనని తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పలు ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు, నిధులు సాధించేందుకు కేంద్ర మంత్రిత్వ శాఖలతో బలమైన సమన్వయం అవసరమని ముఖ్యమంత్రి భావిస్తున్నారు.

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణ, మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు, కొత్త విమానాశ్రయాల అభివృద్ధి, రీజినల్ రింగ్ రోడ్, ప్రతిపాదిత బుల్లెట్ రైలు కారిడార్లు, రీజినల్ రింగ్ రైల్ ప్రాజెక్టు, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు, ఆర్థిక సహకారం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంలో సంజయ్ జాజుకున్న అనుభవం, అక్కడి పనివిధానంపై ఉన్న అవగాహన తెలంగాణకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని సీఎం రేవంత్ రెడ్డి విశ్వసిస్తున్నట్లు సమాచారం.

సీఎస్ పదవి కోసం సీనియర్ అధికారులు జయేష్ రంజన్, వికాస్ రాజ్ వంటి వారి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నప్పటికీ, సుదీర్ఘ సర్వీస్ (2028 మార్చి వరకు), కేంద్రంలో ఉన్న నెట్‌వర్క్‌ను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చివరికి సంజయ్ జాజును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇక, ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు పదవీ కాలం ఈ నెల 30తో ముగియనుంది. వాస్తవానికి 2025 ఆగస్టులోనే పదవీ విరమణ చేయాల్సి ఉన్నా, ఆయనకు రెండు విడతల్లో మొత్తం 10 నెలల పాటు ప్రభుత్వం పదవీ కాలాన్ని పొడిగించిన విషయం తెలిసిందే.

# తుంగభద్ర జలాల్లో అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)
కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను దశాబ్దాల పాటు దోచుకోవడంతో లక్షల ఎకరాలు బీడు భూములుగా మారాయి. ఆ అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరి, కృష్ణా జలాలను తెలంగాణ భూములకు మళ్లించి కరవును పారద్రోలి, పాలమూరు వంటి వలసల జిల్లాలను పచ్చని పంటలతో కళకళలాడేలా చేసిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ జల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించి, రాష్ట్ర ప్రయోజనాలను పక్క రాష్ట్రాల వద్ద తాకట్టు పెట్టే ప్రమాదకరమైన విధానాలను అవలంబిస్తోంది. నదుల అనుసంధానం పేరుతో గోదావరి జలాలను తమ రాష్ట్రానికి మళ్లించే ప్రయత్నం చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి సహకారం అందిస్తున్న మీరు, ఇప్పుడు తుంగభద్రపై కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న అక్రమ ప్రాజెక్టుల విషయంలో కూడా అదే ద్రోహ బుద్ధితో వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే మీరు, అదే ప్రాంతంలోని రైతాంగం భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తుంగభద్రపై కర్ణాటక నిర్మిస్తున్న కురిడి , చిక్కాలపర్వి, చిక్కాలమంచి బ్రిడ్జ్-కమ్-బరాజ్‌లకు మీ ప్రభుత్వం సమ్మతి తెలిపిందా? 2025 జులై 18న కొడంగల్ లిఫ్ట్‌కు కర్ణాటక ఎన్‌వోసీ ఇవ్వడం వెనుక జరిగిన మతలబు ఏమిటి? ఏడాది కాలంగా కర్ణాటక అక్రమ నిర్మాణాలపై అభ్యంతరం చెప్పలేదంటే పరోక్షంగా వాటికి మీరు అనుమతించినట్లేనా? తెలంగాణ నీటిని కర్ణాటకకు తాకట్టు పెట్టే అధికారం మీకు ఎవరు ఇచ్చారని నిలదీసారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఎగువన కర్ణాటక చేపడుతున్న కురిడి ఎత్తిపోతల పథకం చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే ఆర్డీఎస్‌కు రావాల్సిన ప్రవాహాలు తీవ్రంగా తగ్గిపోతాయన్న విషయం మీకు తెలియదా? రాయచూర్ జిల్లాలో 2 టీఎంసీల నీటిని తరలించే కురిడి ఎత్తిపోతల పథకాన్ని రూ.85 కోట్లతో కర్ణాటక అక్రమంగా నిర్మిస్తున్నంటే ఎందుకు అడ్డుకోవడం లేదు? ఇప్పటికే ఈ ప్రాజెక్టు ఇన్టేక్ నిర్మాణాలు 60 శాతం వరకు పూర్తి అయితే మీరు, మీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతున్నదా? ఈ అక్రమ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ కనీసం ఒక్క లేఖ కూడా ఎందుకు రాయలేదని నిలదీసారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ), తెలంగాణ, ఆంధప్రదేశ్ రాష్ట్రాల అనుమతులు లేకుండానే కర్ణాటక తుంగభద్రపై ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులు నిర్మిస్తుంటే మీరు, మీ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోవడం లేదన్నారు. కర్ణాటక తనకు కేటాయించిన పరిమితులను దాటి అదనపు సాగు చేస్తోంది. ఆర్డీఎస్‌లో కర్ణాటక వాటా 1.2 టిఎంసి మాత్రమే. కాని సగటున 5 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం రాజోలిబండ ఆనకట్టకు 100 మీటర్ల ఎగువన అక్రమంగా కర్ణాటక నిర్మిస్తున్న కురిడి లిఫ్ట్, చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే తెలంగాణ వాటా మరింత తగ్గిపోతుంది. ఆర్డీఎస్ పూర్తిగా నిర్వీర్యమయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. ఇప్పుడు కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోకపోతే ఆర్డీఎస్‌తో పాటు తుమ్మిళ్ల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. చివరి దశలో ఉన్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తే గ్రావిటీ ద్వారా నారాయణ పేట, కొడంగల్ కు నీళు ్ళ వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఉద్దేశ్యపూర్వకంగా దాన్ని పక్కనబెట్టారు. కమీషన్ల కొడంగల్ లిఫ్ట్ పేరిట భీమా ప్రాజెక్టు ఆయకట్టు రైతుల శాశ్వత ప్రయోజనాలను దెబ్బతీసారు. 16.94 టీఎంసీల కేటాయింపులో సుమారు 7 టీఎంసీలను కొడంగల్ లిఫ్టుకు మళ్లించి రెండు లక్షల ఎకరాలకు నీళ్లు అందించే భీమా ప్రాజెక్టును నిర్వీర్యం చేశారు. కర్ణాటక అక్రమ ప్రాజెక్టుల ప్రభావం కేవలం ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టులకే పరిమితం కాదు. తుంగభద్ర నుంచి శ్రీశైలం జలాశయానికి వచ్చే ప్రవాహాలు తగ్గితే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులతో పాటు తాగునీటి అవసరాలు, భవిష్యత్తు నీటి ప్రణాళికలు తీవ్రంగా దెబ్బతింటాయన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట...

(మొదటి పేజీ తరువాయి)
2019లో జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికల సమయంలో ఈ కేసులు నమోదయ్యాయి. అప్పటి మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి తరఫున చురుకుగా ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో, రిటర్నింగ్ అధికారి నుంచి ముందస్తు అనుమతి లేకుండా సమావేశాలు నిర్వహించడం వంటి ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలతో ఆయనపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసులను కొట్టివేయాలని రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం, జూన్ 18న తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా బుధవారం తీర్పును ప్రకటిస్తూ, ఐదు కేసులను కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. హైకోర్టు తాజా తీర్పుతో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులకు చట్టపరంగా ముగింపు పలికినట్లయింది.

## బిఆర్ఎస్ నేతల మాటలు నమ్మితే అధోగతే

(మొదటి పేజీ తరువాయి)
బుధవారం వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతు ఆశీర్వాద సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పది సంవత్సరాలలోనే కుంగిపోయిందని భట్టి విమర్శించారు. కేసీఆర్ చేసిన అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీతో చెల్లిస్తోందన్నారు. తండ్రి, కొడుకు, అల్లుడు, కూతురు మాయమాటలతో రాష్ట్రంలో తిరుగుతున్నారని.. ప్రజలు నమ్మవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర సంవత్సరాల కాలంలో ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుతూ వచ్చామని తెలిపారు. కోటి పది లక్షల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆరోగ్య బీమా ఇస్తున్నామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నిరుపేదలకు 22 వేలకోట్ల రూపాయలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని చెప్పారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా కింద వేలకోట్ల రూపాయలు చెల్లించామని తెలిపారు. మహిళల ఉచిత బస్సుకు 13వేల కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన 'సర్' ప్రమాదకరమైందని అన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు. పోలింగ్ సిబ్బందికి సమగ్రమైన సమాచారం అందించాలన్నారు. జూన్ 30వ తేదీన మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాధపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రెండున్నర సంవత్సరాల కాలంలో రైతు భరోసాకు 36 వేల కోట్ల రూపాయలు అందించిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిది అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అవసరమైన ఎరువులను అందించామని చెప్పారు. ఈ నెల 30వ తేదీన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలన్నారు. రైతులను ఆదుకోవడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్, రాష్ట్ర కళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నూత సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

## నేడు తుంగభద్ర ప్రాజెక్టు కొత్త స్పిల్‌వే గేట్ల ప్రారంభోత్సవం

**జూన్ 24.(జర్నలిస్ట్ వార్త)**
ఏపీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సాగు, తాగునీరు అందించే కీలకమైన తుంగభద్ర ప్రాజెక్టుకు కొత్త జవసత్వాలు రానున్నాయి. ప్రాజెక్టుకు కొత్తగా అమర్చిన స్పిల్‌వే గేట్లను నేడు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కూడా పాల్గొంటారు. మూడు రాష్ట్రాలకు చెందిన కీలక నేతల సమక్షంలో ఈ కార్యక్రమం జరగనుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.తుంగభద్ర ప్రాజెక్టుకు మొత్తం రూ. 51 కోట్ల వ్యయంతో 33 కొత్త స్పిల్‌వే గేట్లను ఏర్పాటు చేశారు. 2024 ఆగస్టులో సంభవించిన వరదల సమయంలో ప్రాజెక్టు 19వ నంబర్ గేటు కొట్టుకుపోయింది. ఇది తీవ్ర ఆందోళనకు దారితీసింది. ఆ సమయంలో సీనియర్ ఇంజనీర్ కన్నయ్య నాయుడు నేతృత్వంలోని సాంకేతిక బృందం తాత్కాలికంగా స్టాప్-లాక్ గేటును ఏర్పాటు చేసి నీటిని నియంత్రించింది. ఈ ఘటన అనంతరం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ రంగంలోకి దిగి ప్రాజెక్టును పరిశీలించింది. భద్రతా కారణాల దృష్ట్యా పాత గేట్లన్నింటినీ తొలగించి, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది.ఈ సిఫార్సుల మేరకు ఏపీ, కర్ణాటక రాష్ట్రాలు సంయుక్తంగా పనులు చేపట్టాయి. యుద్ధప్రాతిపదికన కేవలం ఆరు నెలల వ్యవధిలోనే 33 కొత్త గేట్ల నిర్మాణాన్ని పూర్తి చేశాయి. ఈ కొత్త గేట్ల ఏర్పాటుతో వరదల సమయంలో నీటి ప్రవాహాన్ని మరింత సమర్థవంతంగా నియంత్రించవచ్చని, నీటి వృథాను గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు తెలిపారు.రాయలసీమకు జీవనాడిగా భావించే ఈ ప్రాజెక్టు ద్వారా కుడి ప్రధాన కాలువ కింద కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో సుమారు 1.46 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతోంది. అనేక గ్రామాలకు తాగునీటి అవసరాలు కూడా ఈ ప్రాజెక్టు తీరుస్తోంది. గేట్ల ప్రారంభోత్సవం అనంతరం నేతలందరూ హోస్పేటలో జరిగే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు.

# ఏపీలో సువర్ణ అధ్యాయం

గతంలో జొన్నగిరిని స్వర్ణగిరిగా పిలిచేవారని.. మన దగ్గర కూడా బంగారం ఉత్పత్తి సీఎం చంద్రబాబు కాబోతోందని తెలిపారు. భవిష్యత్‌లో దేశమంతా జొన్నగిరి గురించే మాట్లాడుతుందని వెల్లడించారు. ఒకప్పుడు కెజిఎఫ్... ఇప్పుడు జెజిఎఫ్ అని ముఖ్యమంత్రి అన్నారు. చమురు తర్వాత దేశంలో ఎక్కువ దిగుమతి అయ్యేది బంగారమే అని తెలిపారు. రాయలసీమలో సిరులు పండించేందుకు శరవేగంగా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని చెప్పారు. ఏడాదికి టన్ను బంగారం ఉత్పత్తి అవుతుందని తెలిపారు. ప్రస్తుతం 400 కిలోల సామర్థ్యంతో బంగారం ఉత్పత్తి అవుతుందని, భవిష్యత్‌లో 1000 కిలోల బంగారం ఉత్పత్తి చేయనున్నట్లు వెల్లడించారు. రెండో యూనిట్‌తో కలిపి 50 టన్నుల బంగారం ఉత్పత్తి అవుతుందన్నారు. ఇప్పటికే 800 మందికి ఉద్యోగాలు లభించాయని.. త్వరలో మరో 1500 మందికి ఉపాధి లభించనుందన్నారు. భవిష్యత్‌లో 5 వేల మందికి స్వర్ణగిరి గోల్డ్ మైన్స్‌లో ఉపాధి లభిస్తుందని సీఎం పేర్కొన్నారు. గోల్డ్ మైనింగ్‌తో జొన్నగిరిలో పూర్వ వైభవానికి శ్రీకారం చుట్టామని అన్నారు.రాయలసీమను రతనాల సీమగా మార్చడం జొన్నగిరి నుంచే ప్రారంభమవుతుంది. ఈ ప్రాంతాన్ని గతంలో సువర్ణగిరి అని పిలిచేవారు. అశోకుడి నాలుగో రాజధాని ఇది. జొన్నగిరిని సువర్ణగిరిగా మార్చుకుందామా? వందల ఏళ్ల క్రితమే ఈ ప్రాంతం బంగారం, రత్నాలతో నిండింది. అశోకుడి శాసనాలు ఈ ప్రాంత వైభవాన్ని చాటి చెబుతున్నాయి. సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి సీమను కాపాడాలనే ఆలోచన చేసిన వ్యక్తి ఎన్టీఆర్. ఆయన నిర్ణయంతో రాయలసీమ ప్రాంతానికి ప్రాణం పోశాం అని అన్నారు. ఇప్పటికి 400 కిలోల సామర్థ్యంతో ప్రారంభమైంది. భవిష్యత్తులో వెయ్యి కిలోలకు చేరుతుంది. ఇప్పటికే 800 ఉద్యోగాలు వచ్చాయి. త్వరలో 1500 మందికి ఉపాధి కల్పిస్తాం. భవిష్యత్తులో 5వేల మందికి ఈ గోల్డ్ మైన్స్‌లో ఉపాధి దొరుకుతుంది. కులమతాల పేరుతో గొడ్డలి పార్టీ విషం చిమ్ముతోందన్నారు. నేరాలు, ఘోరాలు చేసి రాజకీయ రంగు పులుముతున్నారన్ని ÷ర్ అయ్యారు. రప్పా రప్పా రాజకీయం తప్ప గొడ్డలి పార్టీ చేసిందేమీలేదన్నారు. మళ్లీ వస్తాం.. గొడ్డలితో రప్పా రప్పా ఆడిస్తామంటున్నారని సీఎం చంద్రబాబు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కెసిఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు

(మొదటి పేజీ తరువాయి)
ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏవర్గాన్ని వదిలిపెట్టకుండా కాంగ్రెస్ సర్కార్ వేధిస్తోందని ధ్వజమెత్తారు. సత్తుపల్లి విలేకర్లకు మండల రిపోర్టర్లుగా అక్రిడిటేషన్ జారీ చేసి రేవంత్‌రెడ్డి సర్కార్ అన్యాయం చేసిందని మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహించారు. మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కల్లూరు మున్సిపాల్టీ బీఆర్ఎస్ గెలిచేదని.. సత్తుపల్లిలో కూడా స్వల్ప ఓట్లతో ఈ స్థానం చేజార్చుకున్నామని తెలిపారు. ఆయా ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే పార్టీ శ్రేణులు పొంగిపోకూడదని.. ఓడితే కృంగిపోకూడదని పేర్కొన్నారు. తెలంగాణ మారుమూల ప్రాంతాలు ఎక్కడకు వెళ్లినా దుర్మార్గపు కాంగ్రెస్ పాలన పోవాలని.. కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత కేసీఆర్ హయాంలోని మొదటి పదేళ్లు పునాది రాళ్లు వేసుకున్నామని వివరించారు. రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి జరగాలంటే కేసీఆర్ రావాలని ప్రజలే అంటున్నారని తెలిపారు. కేసీఆర్ ఓటములు, గెలుపులు చూశారని.. అనాడు తెలుగుదేశం పార్టీలో అన్నగారితో కలిసి నడిచారని ప్రస్తావించారు. అన్నదాతలకు రైతుబంధు పూర్తిగా చేయకుండా వేధిస్తోందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలోనూ రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇదే ఖమ్మం జిల్లాకు, కొత్త గూడెం జిల్లాకు, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరిలోని నీటిని ఒడిసిపట్టి మొత్తం సస్యశ్యామలం కావాలి.. ఖమ్మం జిల్లా రూపు రేఖలను మార్చాలనే ప్రయత్నం కేసీఆర్ బలంగా చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ వాళ్లు జల యజ్ఞంలో భాగంగా రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ అనే రెండు ప్రాజెక్టులకు రాళ్లు వేసి పోయారు. కానీ చేసింది పెద్దగా ఏం లేదు. కానీ కేసీఆర్ ఎవరో సంబంధం లేని నాయకుల పేర్లు ఎందుకని ఆలోచన చేసి మీ జిల్లా మొత్తం తెలంగాణకు ఆరాధ్య దైవమైన భద్రాద్రి సీతారామ స్వామి వారి పేరు మీద సీతారామ ప్రాజెక్టు అని పెట్టి మన జిల్లాకు 7 లక్షల ఎకరాలకు.. కొత్తగా నాలుగురన్నర లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టు.. ఎన్ఎస్‌పీల కింద కాలువల కింద ఉండే వ్యవసాయాన్ని స్థిరీకరించడానికి 2.50 లక్షల ఎకరాలకు మొత్తంగా 7 లక్షల ఎకరాలకు సాగునీరందించే బృహత్తర యజ్ఞానికి శ్రీకారం చుట్టారు.అంటే 80 శాతం నిధులు మనం ఇప్పటికే ఖర్చు పెట్టాం. మరి ఈ రెండున్నర సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లా మొత్తం కాంగ్రెస్‌కే గెలుపు అందించిన తర్వాత వాళ్లు మనకేం ఇచ్చారు.. ఇవాళ ఖమ్మం జిల్లా రైతులు ఆలోచన చేయాలి. జిల్లా నుంచి ఉపముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి, రెవెన్యూ మంత్రి.. ముగ్గురు మంత్రులున్నారు. పవర్‌ఫుల్ పోర్ట్‌పోలియోల్లో ఉన్నారు.. పవర్ అంతా ఖమ్మం జిల్లాలోనే ఉందట. కానీ ఖమ్మం జిల్లా ప్రజలకు ఏం ఒరిగింది. ఖమ్మం జిల్లా రైతులకు ఏం జరిగింది.. దయచేసి మీరు ఆలోచించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థుల్లో మాదక ద్రవ్యాలపై
# చైతన్యం కల్పించిన పోలీసులు

### రత్నగిరి పాఠశాలలో 'నో టు డ్రగ్స్' సందేశం







**భీమదేవరపల్లి/జూన్24 (జర్నలిస్ట్ వార్త):** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా భీమదేవరపల్లి మండలం వంగర ఎస్ఐ దివ్య ఆధ్వర్యంలో బుధవారం రత్నగిరి పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ దివ్య సూచించారు. విద్యార్థులు మంచి అలవాట్లను పెంపొందించుకుని సమాజంలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రవి నాయక్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ జెడ్పి చైర్మన్.



**బయ్యారం,జూన్ 24(జర్నలిస్ట్ వార్త):** బయ్యారం కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు భుక్యా రవి నాయక్ కుమారుడుకి ఇటీవల హైదరాబాద్ లో మేజర్ ఆపరేషన్ జరగడంతో బుధవారం మహబూబాబాద్ జిల్లా మాజీ జెడ్పి చైర్మన్ ఆంగోతు బిందు వారి ఇంటికి వెళ్ళి వారి కుమారుడిని పరామర్శించారు.బిందు వెంట బాల్య తండా సర్పంచ్ అజ్మీర దేవోజి నాయక్, జరుప్లా శ్రీను నాయక్,గుగులోతు చిరంజీవి నాయక్,అజ్మీర శ్రీకాంత్ నాయక్,అజ్మీర్ కళ్యాణ్ నాయక్,జాటోతు రవి నాయక్,పంతు నాయక్,మంత్రియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పంటల మార్పిడితో అధిక లాభాలు..

### -వ్యవసాయఅధికారి కే.రాజు.





**బయ్యారం/,జూన్ 24.(జర్నలిస్ట్ వార్త)**
ఎల్నినో వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని, పంట మార్పిడితో అధిక లాభాలు పొందవచ్చని బయ్యారం మండల వ్యవసాయఅధికారి కే.రాజు అన్నారు.బుధవారం వెంకట్రాంపురం గ్రామంలో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. పంటల వైవిధ్యీకరణలో భాగంగా శేరు ఉపేందర్ తన రెండు ఎకరాల భూమిలో బెండకాయ,వంకాయ, కాకరకాయ,చిక్కుడు,ఆకు కూరల వంటి పంటలను పండించడానికి తన వ్యవసాయ భూమిని సిద్ధం చేశారు.ఈ సందర్భంగా రైతు ఉపేందర్ మాట్లాడుతూ గతంలో మొక్కజొన్న, వరి వంటి సాంప్రదాయ పంటలను పండించాను.ప్రస్తుతం వ్యవసాయ ఆదాయాన్ని పెంచుకోవడం కోసం సుస్థిర వ్యవసాయ పద్ధతులతో ఇప్పుడు కూరగాయల సాగులోకి అడుగుపెట్టానని తెలిపారు.ఈ విధంగా వైవిధ్యభరితమైన పంటల విధానం ద్వారా మెరుగైన రాబడిని పొందగలనని ఉపేందర్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ పర్యటన సందర్భంగా రైతుకు శాస్త్రీయ సాగు పద్ధతులు,పోషకాల నిర్వహణ,మొక్కల రక్షణ చర్యలపై అవసరమైన సాంకేతిక సలహాలు వ్యవసాయ శాఖ అధికారులు అందించారు.

## చిన్నారికి ఆశీస్సులు అందించిన జక్కంపూడి వర్గీయులు




**తల్లాడ/, జూన్ 24 (జర్నలిస్ట్ వార్త):**తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామపంచాయతీ పరిధిలోని డీబీ కాలనీలో నారపోగు ప్రభాకర్‌శిరీష దంపతుల ఏకైక కుమార్తె మమత ఓణీల అలంకరణ వేడుక బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కంపూడి వర్గీయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వేడుకకు హాజరై చిన్నారికి అక్షింతలు వేసి ఆశీర్వదించారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జక్కంపూడి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సామినేని రామప్పరావు, జక్కంపూడి రమేష్, ఎనిక నరసింహారావు, రాయల లక్ష్మయ్య, ఇంజన్నర్సరావు, బేగ్ అల్లిబాబు, నాగులు మీరా, పటాన్ ముసాకాన్ తదితరులు పాల్గొని చిన్నారి మమత ఉజ్వల భవిష్యత్తుతో ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు, గ్రామ పెద్దలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. వేడుక ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

# శ్రీ చైతన్య పుస్తకాల విక్రయంపై అధికారుల తనిఖీలు..

### అధిక ధరలు, అక్రమ విక్రయాలపై యూఎస్ఎఫ్ఐ ఆరోపణలు.. పుస్తకాల సీజ్



**భీమదేవరపల్లి/జూన్ 24 (జర్నలిస్ట్ వార్త):**
మండలంలోని ముల్కనూరు గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఒక ఇంటిని గోదాముగా ఉపయోగించి శ్రీ చైతన్య పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు విక్రయిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో బుధవారం మండల విద్యాధికారి (ఎంఈఓ) సునీతారాణి ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు నిర్వహించి పుస్తకాలు, నోటుబుక్కులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకుల మనోజ్, జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేష్ నాయక్ మాట్లాడుతూ, శ్రీ చైతన్య పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, యూనిఫాంలు, లైబ్రరీ, స్కూల్ డెవలప్‌మెంట్ ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక భారం మోపుతున్నారని ఆరోపించారు. ఎమ్మార్పీ ధరల కంటే మూడు రెట్లు అధికంగా వసూలు చేస్తూ ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముల్కనూరులోని ఒక ఇంటిని గోదాముగా మార్చి ఎలాంటి అనుమతులు లేకుండా పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు నిల్వ చేసి విక్రయిస్తున్నారని, దీనిపై ఎంఈఓకు సమాచారం అందించగా ఆమె సమక్షంలో తనిఖీలు నిర్వహించి సామగ్రిని సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ కమర్షియల్ పన్నులు చెల్లించకుండా వ్యాపారం నిర్వహిస్తున్నారని ఆరోపించారు. కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, జిల్లావ్యాప్తంగా శ్రీ చైతన్య పాఠశాలలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా శ్రీ చైతన్య పాఠశాలల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అమ్ముల జయకృష్ణ, నాయకులు సన్నీ, విష్ణు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మల్బరీ సాగుతో రైతులకు అధిక లాభాలు

### ప్రభుత్వ సబ్సిడీలతో పట్టు పరిశ్రమ వైపు రైతుల అడుగులు








**భీమదేవరపల్లి/జూన్ 24 (జర్నలిస్ట్ వార్త):**
మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా మల్బరీ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, యాంత్రీకరణ సౌకర్యాల కారణంగా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో మల్బరీ సాగు విస్తరిస్తోంది. ప్రస్తుతం మండలంలో సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో రైతులు మల్బరీ సాగు చేస్తూ ప్రభుత్వ సబ్సిడీలను పొందుతూ మంచి ఆదాయం ఆర్జిస్తున్నారు. భీమదేవరపల్లి సెరికల్చర్ అధికారి సంజీవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమగ్ర సిల్క్-2 పథకం కింద కొత్తగా మల్బరీ సాగు చేపట్టే రైతులకు పలు రకాల రాయితీలు అందిస్తున్నట్లు చెప్పారు. రెండు ఎకరాలను ఒక యూనిట్‌గా పరిగణించి సాగు చేస్తే, మల్బరీ తోటతో పాటు షెడ్డు, ఇతర అవసరమైన సౌకర్యాల ఏర్పాటుకు బీసీ, ఇతర వర్గాల రైతులకు రూ.4 లక్షల వరకు, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.6 లక్షల వరకు సబ్సిడీలు అందుతున్నాయని వివరించారు. భీమదేవరపల్లి వంటి మెట్ట ప్రాంతాలు మల్బరీ సాగుకు అనుకూలంగా ఉండటంతో రైతులు పట్టు పరిశ్రమ వైపు మొగ్గుచూపితే అధిక లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. సెరికల్చర్ శాఖ అధికారులు సాంకేతిక సహాయం, సాగు విధానాలపై సలహాలు అందిస్తూ కొత్త రైతులకు పూర్తి సహకారం అందిస్తున్నారని చెప్పారు. మల్బరీ సాగుపై ఆసక్తి ఉన్న రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం భీమదేవరపల్లి సెరికల్చర్ అధికారి సంజీవరెడ్డి సెల్: 89777 14609 ను సంప్రదించవచ్చని సూచించారు.

## రాజకీయ పార్టీల ప్రతినిధులకు, బీఎల్ఓలకు సర్ పై అవగాహన.

### -తహసీల్దార్ నాగరాజు.





**బయ్యారం/,జూన్ 24.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం భారత ఎలక్షన్ కమిషన్ వారి ఆదేశాల ప్రకారం ఎస్ఐఆర్ పై మండలంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో, బిఎల్ఏ లకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నేటి నుంచి ప్రారంభమయ్యే ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా బిఎల్ ఓ లు ఇంటింటికీ తిరిగి ఓటర్లు జాబితాలో ఉన్న ప్రతి ఒక్క ఓటరుకు ఎన్యూమరేషన్ ఫామ్ ఇవ్వటం జరుగుతుందన్నారు.ప్రతి ఒక్క ఓటరు ఎన్యూమరేషన్ రెండు ఫారాలు నింపి దానికి సంబంధించిన జిరాక్స్ పత్రాలు జమ చేసి బిఎల్ఓ లకు ఇవ్వాలన్నారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు యొక్క బిఎల్ఏ లకు తగు సూచనలు ఇచ్చి బిఎల్ ఓ లకు సహకరించాలన్నారు.ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారం నింపుటకు సహకారం అందజేయాలన్నారు.అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండి అర్హత ఉన్న ప్రతి ఒక్క ఓటరు ఫారం-6 ద్వారా కొత్త ఓటు నమోదు చేసుకోవాలని,ప్రతి ఓటరు వారికి ఇచ్చిన ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తిగా నింపి బిఎల్ఓ లకు ఇచ్చుటకు ఓటర్లను చైతన్య పరచ వలసినదిగా రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐలు,సూపర్వైజర్స్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏళ్ల తర్వాత బడికి పునర్జీవం..

### పరిశీలించిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్






**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో జూన్ 24 (జర్నలిస్ట్ వార్త):**ఒకప్పుడు మూతపడిన పాఠశాల.. ఇప్పుడు మళ్లీ చిన్నారుల కిలకిలారావాలతో కళకళలాడుతోంది. ధర్మసాగర్ మండలం నర్సింగరావుపల్లి గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలను హనుమకొండ జిల్లా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత్ బుధవారం సందర్శించి, 14 ఏళ్ల తర్వాత పునఃప్రారంభమైన బడి పరిస్థితులను పరిశీలించారు.పాఠశాల పునఃప్రారంభానికి దారితీసిన పరిస్థితులు, గ్రామ పంచాయతీ చేపట్టిన చర్యలు, ప్రజల భాగస్వామ్యంపై గ్రామ సర్పంచ్ శోభారాణి, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గతంలో పాఠశాల మూతపడడానికి గల కారణాలు, తిరిగి ప్రారంభించాల్సిన అవసరం ఎలా ఏర్పడిందనే అంశాలపై వివరాలు సేకరించారు. తరగతి గదులను పరిశీలించిన ఆయన విద్యార్థులకు అందుతున్న బోధన, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై ఆరా తీశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక విద్య ప్రాధాన్యత, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం అవసరంపై ఉపాధ్యాయులు, గ్రామస్తులతో చర్చించారు. పాఠశాల పునరుద్ధరణకు గ్రామస్థాయిలో జరిగిన కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్‌కు చెందిన లోహిత, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌కు చెందిన అపర్ణ, ఎంఈవో డాక్టర్ బి. రాంధన్, ప్రధానోపాధ్యాయుడు శ్యాంసుందర్, పంచాయతీ కార్యదర్శి గిరిబాబు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్షరంతో ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



# గుర్తుతెలియని మహిళ మృతి..

## బంధువుల కోసం పోలీసుల గాలింపు



**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో జూన్ 24:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన గుర్తుతెలియని మహిళ బంధువుల కోసం ధర్మసాగర్ పోలీసులు గాలింపు చేపట్టారు. మృతురాలి వివరాలను గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు ప్రజల సహకారం కోరుతున్నారు.పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 22న రాత్రి 8 గంటల సమయంలో రాంపూర్ గ్రామ శివారులోని రంగసముద్రం చెరువు సమీపంలో జాతీయ రహదారి-163పై గుర్తుతెలియని వాహనం ఓ మహిళను ఢీకొట్టి పరారైంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళను స్థానికులు, 108 సిబ్బంది వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 23వ తేదీ రాత్రి మృతి చెందింది. ప్రస్తుతం మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు.మృతురాలి వయస్సు సుమారు 55 సంవత్సరాలు. ఎత్తు 5.5 అడుగులు. ఆకుపచ్చ రంగు చీర, లేత ఆకుపచ్చ రంగు బ్లౌజ్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆమెను ఎవరైనా గుర్తించినా లేదా బంధువుల వివరాలు తెలిసినా వెంటనే ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు:8712685010, 8712675127

# కార్మిక గర్జనకు ఎంపీ కడియం కావ్యకు ఆహ్వానం



**ధర్మసాగర్ /హనుమకొండ, బ్యూరో జూన్ 24 (జర్నలిస్ట్ వార్త):** భవన నిర్మాణ రంగ కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ డిమాండ్ల సాధన కోసం జూలై 5న హనుమకొండ జిల్లా మడికొండలోని కరిష్మా గార్డెన్‌లో నిర్వహించనున్న ఉమ్మడి జిల్లాల "కార్మిక గర్జన" మహాసభకు హాజరు కావాలని వరంగల్ ఎంపీ కడియం కావ్యను భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం నాయకులు ఆహ్వానించారు.
బీఎన్‌ఆర్‌కేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం ఆదేశాల మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్, హనుమకొండ జిల్లా కన్వీనర్ కొత్తపల్లి బిక్షపతి, జిల్లా కో-కన్వీనర్ ఉపేంద్రం బుధవారం ఎంపీ కడియం కావ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్మికుల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, రంగ అభివృద్ధిపై నిర్వహిస్తున్న మహాసభకు హాజరై కార్మికులకు మద్దతు తెలపాలని కోరారు.ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య సభకు హాజరయ్యేందుకు సానుకూలంగా స్పందించి, కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.అనంతరం గిన్నారపు మహేందర్ మాట్లాడుతూ, వరంగల్ ఉమ్మడి జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులు భారీ సంఖ్యలో జూలై 5న జరిగే కార్మిక గర్జన సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమవుతుందని, ఈ మహాసభ కార్మిక ఉద్యమానికి కొత్త దిశానిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు.

# ఓటు భద్రతకు ఎస్.ఐ.ఆర్ అస్త్రం

## అవగాహనే ప్రజాస్వామ్యానికి రక్ష

## యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం



**వర్ధన్నపేట/జూన్ 24(జర్నలిస్ట్ వార్త):** ఓటు హక్కు కేవలం కాగితానికే పరిమితం కాకూడదని, ప్రతి ఒక్కరూ తమ ఓటును కాపాడుకోవడమే నిజమైన ప్రజాస్వామ్యమని వర్ధన్నపేట మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు నియోజకవర్గవ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభం కానున్న ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై ఆయన ప్రత్యేక ప్రకటన విడుదల చేశారు. ఓటరు జాబితాలో పేర్ల తారుమారు, పొరపాట్ల వల్ల ఎన్నికల సమయంలో ఎంతోమంది నష్టపోతున్నారని. అటువంటి పొరపాట్లకు తావులేకుండా ఉండేందుకే ఈ కార్యక్రమమని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ గ్రామాల్లో జరిగే ఈ ప్రక్రియను సద్వినియోగం చేసుకొని, తమ పేరు జాబితాలో ఉందో లేదో సరిచూసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత పవిత్రమైనదని, దానిని నిర్లక్ష్యం చేయవద్దని హితవు పలికారు. గ్రామస్థాయి నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు ప్రజలను చైతన్యపరిచి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యాకాంతం పిలుపునిచ్చారు.

# నల్లగొండకు సిటీ బస్సు సర్వీసులు

## లాంఛనంగా ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి

**నల్లగొండ,జూన్ 25(జర్నలిస్ట్ వార్త):** నల్లగొండలో సిటీ బస్సు సేవలను రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. పట్టణంలోని మహిళలు షాపింగ్, ఇతర అవసరాల కోసం రాకపోకల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని సిటీ బస్సు సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే మెడికల్ కాలేజీ విద్యార్థులు ఆస్పత్రికి చేరుకోవడానికి ఆటోలపై ఆధారపడాల్సి వచ్చేదని, ఇకపై వారు సిటీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉంటుందని చెప్పారు. బుధవారం కోటి 20 లక్షల రూపాయలతో చేపట్టనున్న నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్ విస్తరణ, ఆధునికీకరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తొలుత 2 సిటీ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సిటీ బస్సు సర్వీసులు చెరువుగట్టు-ఎస్ఎల్‌బీసీ మార్గంతో పాటు ధర్వేశిపురం నుండి దుప్పలపల్లి వరకు నడిచేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. నల్లగొండకు అదనంగా 30 బస్సులు కేటాయించడం జరిగిందని, 56 మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఎస్ఎల్‌బీసీ వద్ద పెట్రోల్ పంపు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, రెస్టారెంట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. బస్టాండ్ విస్తరణలో భాగంగా కొత్త కౌంటర్లు, వెయిటింగ్ బాత్రూంలు, టాయిలెట్లు, ఆధునిక ఎ÷-లాట్‌ఫారాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

# అడ్మిషన్ల కోసం ప్రత్యేక ప్రచారం..

### -అడ్మిషన్ తీసుకునే విద్యార్థినిలకు ఉచిత హాస్టల్ సౌకర్యం.

### -కళాశాల ప్రిన్సిపాల్ రాజమణి





**బయ్యారం/,జూన్ 24.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు బుధవారం మండలంలోని వివిధ గ్రామాలలో అడ్మిషన్స్ కోసం విస్తృత ప్రచారం నిర్వహించారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ తీసుకునే విద్యార్థినిలకు బాలికల పోస్ట్ మెట్రిక్ హాస్టల్ లో ఉచిత వసతి,ఉచిత భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజమణి తెలిపారు.అంతేగాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచితం పాఠ్యపుస్తకాలు,అనుభవజ్ఞులైన అధ్యాపకులు,డిజిటల్ క్లాస్ రూమ్స్, సైన్స్ కు సంబంధించిన ప్రయోగశాలలు,ప్రతి రోజూ స్లిప్ టెస్టుల నిర్వహణ,వారాంతపు టెస్టులు,విద్యార్థిని విద్యార్థులకు మానసిక ఉల్లాసానికి క్రీడల ప్రాధాన్యత,ఉంటాయని కళాశాల ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.ఈ అడ్మిషన్ డ్రైవ్ లో అధ్యాపకులు సంతోష్,సరిత,స్నేహ,బాబూలాల్ పాల్గొన్నారు.

# వారసుడొచ్చాడు..

### -బయ్యారం సర్పంచ్ దంపతుల భావోద్వేగం.




**బయ్యారం/,జూన్ 24.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది.శాంతి కిషన్ నాయక్ దంపతుల చిన్న కుమారుడు పృథ్వీ రాజు,త్రివేణి దంపతులకు మగబిడ్డ జన్మించినట్లు కిషన్ నాయక్ తెలిపారు.మంగళవారం రాత్రి ఖమ్మం గవర్నమెంట్ హాస్పిటల్లో జన్మించిన బాబు,తల్లి త్రివేణి ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని సర్పంచ్ శాంతి తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంపతులు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. భగవంతుని దయ,ఆంజనేయస్వామి కృప వల్లే ఈ శుభం జరిగిందని వారు పేర్కొన్నారు.ఈ ప్రసవంలో కీలక పాత్ర పోషించిన వైద్యులకు,గవర్నమెంట్ హాస్పిటల్ సిబ్బందికి సర్పంచ్ దంపతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# సమయపాలనకు తూట్లు..

### ఇరిగేషన్ కార్యాలయంలో రైతుల పడిగాపులు

### ఖాళీ కుర్చీలే దర్శనం... అధికారుల కోసం గంటల తరబడి నిరీక్షణ -ఖరీఫ్ సీజన్ వేళ పనులు పెండింగ్‌లోనే!




**తల్లాడ/, జూన్ 24 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అధికారులు, ఉద్యోగులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తల్లాడలోని ఇరిగేషన్ సబ్ డివిజన్ నెం.3 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కార్యాలయ సమయం ప్రారంభమైన తర్వాత కూడా పలువురు ఉద్యోగులు విధులకు హాజరుకాకపోవడంతో రైతులు, కాంట్రాక్టర్లు గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
బుధవారం ఉదయం 10.30 గంటలు దాటినా కార్యాలయంలో పలువురు ఉద్యోగుల కుర్చీలు ఖాళీగానే కనిపించాయి. సాగునీటి సమస్యలు, కాలువల మరమ్మతులు, బిల్లుల చెల్లింపులు, ఇతర పరిపాలనా పనుల కోసం వచ్చిన రైతులు అధికారుల రాక కోసం నిరీక్షించాల్సి వచ్చింది. ప్రభుత్వ కార్యాలయ సమయం ప్రారంభమైనా సిబ్బంది పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**ఖరీఫ్ వేళ రైతులకు ఇబ్బందులు**

ఖరీఫ్ సాగు సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో కాలువల పూడికతీత, తూముల మరమ్మతులు, సాగునీటి సరఫరా వంటి అంశాలు అత్యంత కీలకంగా మారాయి. అయితే సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడంతో రైతుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఒక ఫైల్ కదలాలన్నా, ఒక సంతకం కావాలన్నా రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు తల్లాడ సబ్ డివిజన్ కార్యాలయ పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఉద్యోగుల హాజరుపై కఠిన పర్యవేక్షణతో పాటు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రైతులకు సకాలంలో సేవలు అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# జులై 7న దండోరా జెండా పండుగను విజయవంతం చేయాలి

### - ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జ్ మహేందర్, జర్నలిస్ట్ ఫోరం నేత కరుణాకర్





**భువనగిరి/జూన్ 25(జర్నలిస్ట్ వార్త):** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు వచ్చే జులై 7న నిర్వహించనున్న మాదిగ దండోరా ఆవిర్భావ జెండా పండుగలను యాదాద్రి భువనగిరి జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జ్ మహేందర్, జర్నలిస్ట్ ఫోరం నేత కరుణాకర్ పిలుపునిచ్చారు. భువనగిరిలో గురువారం మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర నాయకులు బిర్రు కరుణాకర్ మాదిగతో కలిసి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇంచార్జ్ బిర్రు మహేందర్ మాదిగ మాటా-ముచ్చట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటగా బిర్రు మహేందర్ మాదిగ మాట్లాడుతూ జులై 7న జరగబోయే దండోరా ఆవిర్భావ జెండా పండుగలను ఉమ్మడి జిల్లాలోని ప్రతి గ్రామంలో పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రాబోయే రోజుల్లో దండోరా భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను మరింత ఉధృతం చేస్తామని, రాజ్యాధికార దిశగా మాదిగ సమాజం అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైందని ఉద్ఘాటించారు.అనంతరం మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర నాయకులు బిర్రు కరుణాకర్ మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆశయాలను, ఆలోచన విధానాన్ని గ్రామీణ స్థాయిలోని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాలు క్షేత్రస్థాయిలో చేపట్టే ప్రతి ప్రజాపోరాటాన్ని ప్రజల్లోకి క్షుణ్ణంగా తీసుకెళ్లేందుకు మాదిగ జర్నలిస్ట్ ఫోరం పూర్తి స్థాయిలో అంకితభావంతో పనిచేస్తుందని స్పష్టం చేశారు. భవిష్యత్తు ఉద్యమాల్లో జర్నలిస్టులు ఎల్లప్పుడూ ముందు వరుసలో నిలబడి దండోరా లక్క్ష్య సాధనకు కట్టుబడి ఉంటారని భరోసా ఇచ్చారు. ప్రతి గ్రామంలో దండోరా జెండాలను ఎగురవేసి, ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కార్యకర్తలను కోరారు.

# అంగన్వాడీ కేంద్రం, పూర్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్/ జూన్ 24(జర్నలిస్ట్ వార్త):** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తెట్టేకుంట తండ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం మరియు పూర్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం సందర్శించారు.

ఈ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న విద్యా బోధన, పోషకాహార కార్యక్రమాలు, మౌలిక వసతులను పరిశీలించారు. పిల్లల హాజరు, విద్యా ప్రమాణాలు, అంగన్వాడీ కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని, కేంద్రాలు మరియు పాఠశాలల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.

ఎంపీపీస్ తెట్టేకుంట తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పూర్తిగా శిధిలావస్థలో ఉన్నందున రానున్న వర్ష కాలం దృష్ట్యా సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు.పరిసరప్రజలకు ఏదైనా త్రాగునీటి సరఫరా సమస్య లు ఉన్నట్లు అయితే పరిష్కరించాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారి నిర్మలను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, ఆర్డీవో సుమ,రాయపర్తి తహసిల్దార్ శ్రీనివాస్ సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## వర్ధన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో ఎస్.ఐ.ఆర్ హెల్ప్ డెస్క్ ప్రారంభం




**వర్ధన్నపేట/జూన్ 24(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ,ఎస్.ఐ.ఆర్ - 2026, హెల్ప్ డెస్క్‌ను బుధవారం వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సత్య శారదా, ఎన్నికల నమోదు అధికారి ఆర్డీఓలు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ హెల్ప్ డెస్క్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఓటరు జాబితా పక్కాగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్ఓ, వర్ధన్నపేట తహసీల్దార్ విజ్ సాగర్ తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.




# చంద్రబాబు జేబు సంస్థగా పోలీస్ వ్యవస్థ

**సాయికృష్ణ కేసులో సాక్ష్యాలను మాయం చేశారు**

**పోలీసుల తీరుకు నిరసనగా వచ్చేనెల 29న పాదయాత్ర**

**మీడియా సమావేశంలో అంబటి రాంబాబు**

**గుంటూరు,జూన్ 25(జర్నలిస్ట్ వార్త):** ఏపీలో పోలీసు వ్యవస్థ చంద్రబాబు జేబు సంస్థగా మారిందని మాజీ మంత్రి అంబటి రాంబాబు సంచలన ఆరోపణలు చేశారు. సాయికృష్ణ కేసులో సాక్ష్యాలను మాయం చేశారు. ఏ తప్పు చేయకపోయినా తనను అరెస్ట్ చేశారంటూ మండిపడ్డారు. 18 రోజుల పాటు రాజమండ్రి జైల్లో ఉంచారు. వచ్చే నెల 29న వినతి పాదయాత్ర చేస్తా అని అంబటి ప్రకటించారు. అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ.. 'కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఒత్తిడితోనే నాపై కేసులు నమోదు చేశారు. నా ఇంటిపై దాడి చేయడమే కాకుండా నాపై



అక్రమంగా రెండు కేసులు పెట్టారు. నన్ను జైలులో ఉంచారు. రెండు కేసుల్లో ఏడేళ్ళ లోపు శిక్ష పడే సెక్షన్లే పెట్టారు. ఈ కేసులో ఇద్దరు సీఐలు, ఒక ఎస్ఐకి హైకోర్టు.. కోర్టు ధిక్కరణ కింద నోటీసులు ఇచ్చింది. వంశీధర్ అనే సీఐ, మధు అనే ఎస్ఐ ఇల్లీగల్‌గా నన్ను లోపలేశారు. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లుకి హైకోర్టు నోటీస్ ఇచ్చింది. ఈ ముగ్గురు పోలీసులను కేంద్ర మంత్రి పెమ్మసాని పురిగొల్పి నన్ను అరెస్ట్ చేయించారు. డీజీపీ, ఐజీ, ఎస్పీ, డిఎస్పీలకు చెబుతున్నాను. నా ఇంటిపై దాడి చేసిన వాళ్లపై ఎందుకు చర్యలు తీసుకోలేదు. అందుకే వచ్చే నెల 29వ తేదీన వినతి పాదయాత్ర చేస్తున్నాను. పోలీస్ వ్యవస్థ చంద్రబాబు జేబు సంస్థగా కొనసాగుతుంది. సాయికృష్ణ అంశంపై మేము పోరాడటానికి కారణం వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయనే. కృష్ణలంక పోలీస్ స్టేషన్లో ఏడాది సీసీటీవీ ఫుటేజ్ మాయం చేశారు. ఏడాది నుండి పీఎస్‌లో నేరాలు జరుగుతున్నాయి. ఐజీ రవి ప్రకాష్ ఆధ్వర్యంలోనే సాక్ష్యాధారాలు మాయం చేశారు. సీఐ నాగరాజుతో బేరసారలాడారు. ఏ పోలీస్ పేరు చెప్పవద్దని సీఐ నాగరాజును బతిమలాడారు. ఏ తప్పు చేయకపోయినా నన్ను అరెస్టు చేసి జైలులో వేశారు. కానీ, సీఐ నాగరాజును లాకప్‌లో ఎందుకు వేయలేదు?. పోలీసులు ప్రజలను కాపాడలేరు. సీఎం, హోంమంత్రి విఫలమయ్యారు. పవన్ కల్యాణ్.. నాగరాజును జిందాబాద్ అంటారేంటి ఆయనకు సిగ్గు అనిపించడం లేదా?. పవన్ కల్యాణ్ ఆత్మవిమర్శ చేసుకోవాలి. హోంమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణలో విస్తరించిన నైరుతి

## వారంపాటు జోరు వర్షాలు పడే అవకాశం

**హైదరాబాద్,జూన్ 25(జర్నలిస్ట్ వార్త):** నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు తెలంగాణ అంతటా విస్తరించడంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు పడుతున్నాయి. ఈ వారం రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. వర్షాలు ఆలస్యం కావడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. నారు వేసుకోవడం ఆలస్యం అవుతోందని అన్నారు. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఉష్ణ పరిస్థితుల వల్ల ఈ ఏడాది కాస్త మందకొడిగా సాగిన పవనాలు.. జూన్ 8న రాష్ట్రాన్ని తాకినప్పటికీ, తెలంగాణను పూర్తిగా కమ్మేయడానికి దాదాపు 15 రోజుల సమయం తీసుకున్నాయి. ఈ ప్రభావంతో సోమవారం నుంచి మంగళవారం వరకు పలు జిల్లాల్లో రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్ మండలం కూనారంలో ఏకంగా 17.1 సెం.మీల వాన పడింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఇదే అత్యధికం కావడం విశేషం. హైదరాబాద్ వ్యాప్తంగా భారీ వర్షాలు కురవగా.. రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల్లో వానలు దంచికొట్టాయి. వీటితో పాటు సంగారెడ్డి, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, జగిత్యాల, ములుగు, ఆదిలాబాద్ జిల్లాల్లో మంగళవారం పగటిపూట కూడా వర్షాలు ఊపందుకున్నాయి. రాబోయే బుధ, గురు, శుక్రవారాల్లో మరిన్ని భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నెల 24న జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వానలు జోరుగా సాగనున్నాయి. ఆ మరుసటి రోజు (25వ తేదీన) ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో తీవ్రత ఎక్కువగా ఉంటుంది. 26వ తేదీన ఈ ప్రాంతాలతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ భారీ వర్షాలు కురుస్తాయని, మిగిలిన జిల్లాల్లో ఓ మోస్తరు వానలు పడతాయని అధికారులు స్పష్టం చేశారు.



# సాయిబాబా భక్తుల మనోభావాలను గౌరవిస్తాం.

## దుష్ప్రచారాన్ని నమ్మవద్దు : రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

**అమరావతి,జూన్ 25(జర్నలిస్ట్ వార్త):** సాయిబాబా ఆలయాల విషయంలో తాను చేసిన వ్యాఖ్యలను కొంతమంది వక్రీకరించి, సాయిబాబా భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం చేయడం బాధాకరం. నా వ్యాఖ్యల ఉద్దేశాన్ని పూర్తిగా పక్కనబెట్టి కొన్ని మీడియా సంస్థలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నేను ఖండిస్తున్నాను. ముందుగా ఒక విషయం చాలా స్పష్టంగా చెబుతున్నాను. నేను వ్యక్తిగతంగా సాయిబాబా భక్తుడిని. ప్రతిరోజూ ఉదయం నా పూజా మందిరంలో వివిధ దేవతామూర్తులతో పాటు గురుపీఠంపై కొలువై ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించిన తర్వాతే నా దినచర్యను ప్రారంభిస్తాను. సాయిబాబా పట్ల నాకు అత్యంత గౌరవం, భక్తి ఉన్నాయి. నా వ్యాఖ్యల వల్ల ఏ ఒక్క భక్తుని మనోభావాలు దెబ్బతిని ఉంటే, వారిని హృదయపూర్వకంగా మన్నించమని కోరుతున్నాను అన్నారు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి. రాష్ట్ర ప్రభుత్వం గానీ, దేవాదాయ శాఖ గానీ, తిరుమల తిరుపతి దేవస్థానాలు గానీ ఎవరిపైనా వివక్ష చూపడం లేదు. అలాగే ఎవరైనా ఆరాధించే మహనీయులను కించపరచే ఉద్దేశం కూడా తమకు లేదని అన్నారు. సాయిబాబా పట్ల కోట్లాది మంది భక్తులకు అపారమైన విశ్వాసం ఉంది. ఆ విశ్వాసాన్ని మేము పూర్తిగా గౌరవిస్తాము. సాయిబాబా ఆలయాల్లో పూజలు హిందూ




సంప్రదాయాలకు అనుగుణంగా జరుగుతున్నాయన్న విషయం కూడా అందరికీ తెలిసిందే. అయితే టీటీడీ ఆధ్వర్యంలో చేపడుతున్న 5వేల భజన మందిరాలు నిర్మాణ కార్యక్రమానికి ఒక నిర్దిష్ట లక్ష్యం ఉంది. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ, ప్రచారం, గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ హిందూ దేవాలయాల నిర్మాణమే ఆ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి నిధుల విడుదల టీటీడీ రూపొందించిన మార్గదర్శకాలు, శ్రీవాణి ట్రస్టు నిబంధనలు, పరిపాలనా విధానాల ప్రకారమే జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇది ఎవరి విశ్వాసాన్ని తక్కువ చేసి చూడడం కాదని, నిధుల కేటాయింపు అనేది పూర్తిగా ట్రస్టు లక్ష్యాలు, నిబంధనలు, పరిపాలనా మార్గదర్శకాల ఆధారంగా జరుగుతున్న ప్రక్రియ మాత్రమే అని స్పష్టం చేసారు.


సాయిబాబా ఆలయాలకు ఈ పథకం కింద నిధులు ఇవ్వకపోవడం అంటే సాయిబాబా స్వామివారిని లేదా ఆయన భక్తులను అవమానించడం కాదని స్పష్టం చేసారు. మన సమాజంలో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, పరమశివుడు, అమ్మవారు, అయ్యప్ప స్వామి, ఆంజనేయస్వామి, సాయిబాబా వంటి అనేక ఆరాధనా రూపాల పట్ల ప్రజలకు అపారమైన విశ్వాసం ఉంది. ప్రభుత్వం ఏ విశ్వాసాన్నీ కించపరచదు. ప్రతి భక్తుని మనోభావాలను గౌరవించడం మా ప్రభుత్వ విధానం. కాబట్టి ఈ అంశాన్ని అనవసర వివాదంగా మార్చడం సరికాదని అన్నారు. ఇది భక్తి, విశ్వాసాలకు సంబంధించిన అంశం కాదు. ట్రస్టుల లక్ష్యాలు, వాటి నిబంధనలు, పరిపాలనా విధానాలకు సంబంధించిన అంశం మాత్రమే. సనాతన ధర్మ పరిరక్షణతో పాటు ప్రతి భక్తుని విశ్వాసాన్ని గౌరవించడం కూటమి ప్రభుత్వం, దేవాదాయ శాఖ యొక్క స్పష్టమైన విధానం. సాయిబాబా భక్తుల విశ్వాసాన్ని గౌరవిస్తాం. అదే సమయంలో సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ట్రస్టుల లక్ష్యాలను కూడా గౌరవిస్తాం. వాస్తవాలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ఎవరూ నమ్మవద్దని మంత్రి కోరారు.

# హాస్టల్ వాష్‌రూమ్‌లో యువతి ప్రసవం

**కిటికీ నుంచి శిశువు బయటకు విసిరివేత**

**యువతిని నీలోఫర్‌కు తరలించిన సిబ్బంది**

**హైదరాబాద్,జూన్ 25(జర్నలిస్ట్ వార్త):** గోల్కొండ ప్రాంతంలో ఉన్న ఓ విద్యార్థినుల హాస్టల్‌లో ఓ విద్యార్థిని ప్రసవం తీవ్ర కలకలం రేపింది. హాస్టల్‌లో ఉంటున్న ఓ యువతి బాత్‌రూంలో ప్రసవించగా, అనంతరం నవజాత శిశువు మృతి చెందడం ఆందోళనకు గురిచేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, హాస్టల్‌లో నివసిస్తున్న యువతి అకస్మాత్తుగా బాత్‌రూంలో ప్రసవించింది. అనంతరం శిశువు మృతి చెందినట్లు గుర్తించారు. శిశువు వెంటిలేటర్ ప్రాంతం నుంచి కింద పడేయడంతో మరణించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే శిశువు మృతికి గల ఖచ్చితమైన కారణాలు పోస్టుమార్టం నివేదిక అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. ఘటనలో మరో ముఖ్యమైన అంశం యువతి గర్భవతి అనే విషయం హాస్టల్ సిబ్బందికి తెలియకపోవడం. హాస్టల్‌లోనే ఉంటున్న విద్యార్థిని గర్భవతి అయినప్పటికీ ఎవరూ గుర్తించలేకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. దీనిపై కూడా పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. యువతిని చికిత్స నిమిత్తం నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. మరోవైపు, శిశువు మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించే ఏర్పాట్లు చేశారు. ఘటనతో హాస్టల్‌లోని విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. యువతి గర్భానికి, శిశువు మృతికి దారితీసిన పరిస్థితులపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా యువతి బావ పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.



# స్వల్పంగా దిగిన బంగారం ధరలు

**హైదరాబాద్,జూన్ 25(జర్నలిస్ట్ వార్త):** బంగారం కొనాలనుకునే వారికి శుభవార్త. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారం, వెండి ధరలు మెల్లగా దిగి వస్తున్నాయి. అమెరికా డాలర్ బలపడడం, అక్కడి బాండ్ రాబడులు పెరగడం వంటి కారణాలతో పసిడికి డిమాండ్ తగ్గుతోంది.గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, బుధవారం ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,44,330గా ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,32,300గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదలను నమోదు చేశాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,40,000గా ఉంది.

